ఓం శ్రీ సాయిరాం

ప్రేమస్వరూపులైన విద్యార్థులారా! విద్యాబోధకులారా! విద్యాభిమానులారా!

విద్యావిషయమునగాని, వైజ్ఞానిక విషయమునగాని మనము వెనుకబడిన, మన తల్లిదండ్రులు ఎంత విచారించుదురో, నైతికముగా, ఆధ్యాత్మికముగా వెనుకబడిన బిడ్డలనుచూచి దేశమాత అంతకంటే పదిరెట్లు విలపిస్తుంది. దేశమాత, దేహమాతల పరితాపమును చల్లార్చి, దేశమునకు శాంతిభద్రతలు చేకూర్చుటకు విద్యార్థులే తగిన సమర్థులు. విద్యార్థులు దేశమునకు పునాదులవంటివారు. పునాదులు భద్రముగా ఉన్నప్పుడే భవనము సుస్థిరముగా ఉంటుంది. కనుక, ఈనాడు విద్యార్థులనే పునాదులను భద్రముగా ఉంచే నిమిత్తమై, అధ్యాపకులు, ప్రజలు, ప్రభుత్వము, తల్లిదండ్రులు సహకరించటానికి తగిన కృషి సలపాలి. విద్య పంచభూత సమ్మిళితమైనది. పంచప్రాణములతో కూడినది. పంచకోశ సమన్వితమైనది.

సమావేశమైన సభ్యులారా! పవిత్రమైన విద్యావిధానమందు మనము తెలుసుకొనవలసిన విషయములు అనేకములున్నాయి. ప్రాచీనకాలమందు నైతికగౌరవమే పవిత్రమైన జీవితముగా విశ్వసిస్తూ వచ్చారు. ఈనాడు విద్యారణ్యమందు విద్యార్థులు సంహపు పిల్లలవలె విహారము సలపాలి. కుయుక్తులు కలిగి, మోసములు, దగాలుచేసే నక్కలవలె, తోడేళ్ళవలె సంచరించరాదు. విద్యారణ్యములో ఎక్కడ చూచినా గొఱ్ఱెలు మాత్రమే కనిపిస్తున్నాయి. తోడేళ్ళు మాత్రమే, నక్కలు మాత్రమే కనిపిస్తున్నాయి. విద్యార్థులున్న ప్రదేశము శాంతభద్రతలతో, పవిత్ర వాతావరణముతో విలసిల్లుచుండినవి. కానీ ఈనాడు విద్యార్థులున్న ప్రదేశము శాంతిభద్రతలతో ఉన్నదా? లేదు. విద్యార్థులు ప్రజారక్షకులు, ప్రజాపోషకులు, భవిష్యత్తు నాయకులు, భావిభారత అద్ధారకులు. ఇలాంటి భవిష్యత్తునకు అనుగుణంగా, తగిన జీవితశిలను తీర్చిదిద్దటానికి సరైన విద్యాసంస్థలు అత్యవసరము.

ప్రేమస్వరూపులారా! ఈనాడు విద్యావంతులందరికీ స్వార్థము పెరుగుచున్నది. మనము హృదయమును విశాలము చేసుకోవాలి. ప్రేమతత్త్వాన్ని పెంచుకోవాలి. కృతజ్ఞత మానవుని నిజస్వరూపమని నిరూపించాలి. కాని, ఈనాడు ఉపకారికే అపకారము చేస్తున్నారు. ఇది విద్యారంగమందు అధికముగా జరుగుచున్నది. ఏ అధ్యాపకులైతే విద్యార్థులకు బోధిస్తున్నారో, ఆ అధ్యాపకుల తలలనే పగలగొడుతున్నారు ఈనాటి విద్యార్థులు.

విద్యార్థులారా! భరతదేశములో 108 విశ్వవిద్యాలయములున్నాయి. 108 అష్టోత్తర నామములు. ఈనాడు మన యూనివర్సిటీ అష్టత్తరనామాన్ని దాటిపోయింది. ఇది అన్ని విశ్వవిద్యాలయములవలె కాకుండా (అన్ని విశ్వవిద్యాలయములు బాగుండాలి. ప్రతి విశ్వవిద్యాలయము ఉన్నతస్థాయినందుకోవాలి. లోకాస్సమస్తా సుఖినో భవంతు) సత్యసాయి విశ్వవిద్యాలయము అదర్శవంతమైన రీతిగా రూపొందాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలు, ప్రభుత్వము, అధ్యాపకులు తోడుగా ఉండి తగినరీతిగా సహాయమునందించాలని ఆశిస్తున్నాను.

ప్రాపంచిక సంభంధమైన సబ్జక్టులతోబాటు నైతిక, ధార్మిక, ఆధ్యాత్మిక సంబంధమైన భావములనుకూడా బోధించి, వీటికి అనుగుణముగా మా విద్యార్థులను రూపొందించాలని మా విశ్వవిద్యాలయముయొక్క ఆశయము. ఇట్టి విశ్వవిద్యాలయములను ప్రాచీన కాలమందు మహర్షులు నెలకొల్పి,ఎన్నో శ్రమలకోర్చి, వారి భక్షగా భారతీయ సంస్కృతిని అందించిపోయారు. ఇట్టి విశాలమైన, దివ్యమైన, భవ్యమైన సంస్కృతిని కోల్పోయి, ఈనాడు ఏదో అశాశ్వతమైన, అసత్యమైన కొన్ని సంస్కృతులకు ఆలవాలమై మన జీవితమును కోల్పోతున్నాము.

విద్యార్థులారా! అధ్యాపకులారా! సమావేశమైన భక్తులారా! అధికారులారా! నిజముగా ఈనాడు మన విద్యాసంస్థకు శుభ దినము. వృక్షమునకు వేర్లువంటి వారు విద్యార్థులు. విద్యావృక్షము శాఖలుశాఖలుగా ఎదిగి, అనేక ఫలపుష్పములతో నిండి, జగత్తునకు శాంతిభద్రతలు అదించుటకు విద్యార్థులే వేర్లుగా నిలవాలి. ఈ వేర్లకు నీరుపోయటమే సత్యసాయి లక్ష్యము. నేను విద్యార్థులకే అన్నివిధములుగా అర్పితమైపోతున్నాను. నా సమస్తమూ విద్యార్థులనే నేను విశ్వసిస్తున్నాను. సత్యసాయి ప్రోపరిటీ ఏమిటంటే అనేకమంధి చెబుతుంటారు, అబ్బో! ఇన్ని బిల్డింగులున్నాయి, ఇన్ని భూములున్నాయి, అని. ఇవన్నీ వట్టి మాటలే. నా ప్రోపరిటీ అంతా నా పిల్లలే!

కాని, ఈ సత్యాన్ని కొంతమంది గుర్తించలేకపోతున్నారు. ఒక్క తల్లి ప్రేమను అర్థముచేసుకోలేని దురదృష్టవంతులు, వేయి తల్లుల ప్రేమను ఎట్లు అర్థముచేసుకొంటారు? సత్యసాయియందున్న ముఖ్యలక్షణము సహనము. ఎంమందో నన్ను విమర్శిస్తుంటారు. ఎంతమందో దూషిస్తుంటారు. ఎన్ని పేపర్లో ఏమేమో వ్రాస్తుంటాయి. ఎన్ని ఫ్లాంఫట్సో కొట్టిస్తుంటారు. ఏమేమో జరుగుతుంటాయి ప్రపంచములో. అన్నింటికీ జవాబు నా చిరునవ్వే. ఇవన్నీ మంచికి జరిగే విరుద్ధ వికారాలే. కాచిన చెట్లకే రాళ్ల దెబ్బలు. ఇంకా కొంతమంది, సత్యసాయి సంస్థలు, సత్యసాయి విద్యాలయములు విరివిగా పెరుగుచున్నవనే అసూయచేత ఎన్నో విషయాలను కల్పిస్తూ, పిల్లలకుకూడా ఉద్రేకాలను కలిగిస్తుంటారు.

ప్రేమస్వరూపులారా! వీరేకాదు, జగమంతా ఏకమైనప్పటికీ నన్నేమీ చేయలేరు. నా లక్ష్యము నాది. నేను చేసేది మంచిది. నా హృదయమెప్పుడూ పవిత్రమే. నాకు స్వార్థముగాని, స్వంతముగాని లేదు. ఇదే నా సత్యము. ఈ సత్యాన్ని విశ్వసించినవారు తమ

జీవితాన్నే అర్పితము చేయటానికి వెనుకంజ వేయరు. దోషములున్నవారికి అదురుబెదురుగాని ఏ దోషమూలేని సింహమునకు భయమెందుకు? నేను చేసే పనులన్నీ లోకకల్యాణ నిమిత్తము. అందేగాని నా నిమిత్తము కాదు. ఈ సత్యాన్ని గుర్తించుకున్నాను కనుక నాకెప్పుడూ ఆనందమే! దైవత్వాన్ని, సత్యతత్త్వాన్ని గుర్తించుకుంటే ఈవిధమైన మానసిక కలతలకు ఏమాత్రమూ అవకాశముండదు.